క్లుప్తంగా

నేడు దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ

భూపాలపల్లి రూరల్:భూపాలపల్లి నియోజకవర్గ పరిధిలోని అర్హతగల దివ్యాంగులకు నేడు (గురువారం) ఉదయం 11గంటలకు కలెక్టర్ కార్యాలయంలోని ఐడీఓసీ మందిరంలో అలీంకో సంస్థ సహకారంతో ఉపకరణాలను పంపిణీ చేయనున్నట్లు ఇన్‌చార్జ్ జిల్లా సంక్షేమ అధికారిణి మల్లీశ్వరీ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో బ్యాటరీతో నడిచే సైకిళ్లు, కాలిపర్స్, కృత్రిమకాళ్లు, వీల్‌చైర్లు, వాక్‌స్టిక్, వినికిడివంటి ఉపకరణాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఎంపికైన దివ్యాంగులు తమ ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలన్నారు.

దోమల నివారణ మందు పిచికారీ


దోమల నివారణ మందు పిచికారీ చేయిస్తున్న హెల్త్ అసిస్టెంట్ లక్ష్మణ్

కన్నాయిగూడెం : మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సిబ్బంది సర్వాయి గ్రామ పంచాయతీలోని భూపతిపురంలో దోమల నివారణ మందు పిచికారీ చేశారు. గ్రామంలోని ప్రతీ ఇంటిలో హెల్త్ అసిస్టెంట్ లక్ష్మణ్ సిబ్బందితో కలిసి దోమల మందును పిచికారీ చేయించారు. అనంతరం వారు మాట్లాడుతూ సీజన ల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

రోడ్లపై పశువులు.. బందెలదొడ్డికి తరలింపు


బందెలదొడ్డికి పశువులను తరలిస్తున్న జీపీ సిబ్బంది

ఏటూరునాగారం : మండల కేంద్రంలోని ప్ర. దానరోడ్డుపై వాహనాలకు అడ్డుగా పడుకొని రోడ్డు ప్రమాదాలకు కారణం అవుతున్న పశువులను గ్రామ పంచాయతీ సిబ్బంది బుధవారం రాత్రి బందెలదొడ్డికి తరలించారు. గ్రామస్తులు ఫిర్యాదు మేరకు ఈ చర్యలు తీసుకున్నట్లు పంచాయతీ కార్యదర్శి రమాదేవి తెలిపారు. ప్రజల అవసరాల నిమిత్తం, వారి రక్షణ కోసం రోడ్లపై వాహనాలకు, బాటసారులకు అడ్డుగా పడుకొని ప్రమాదాలకు కారణం అవుతున్నాయని అనేక ఫిర్యాదులు వచ్చాయన్నారు. దీంతో వాటిని బందెల దొడ్డికి తరలించినట్లు ఆమె తెలిపారు.

దరఖాస్తుదారులకు తప్పని తిప్పలు


ఎండలో నిలబడిన రైతులు

కన్నాయిగూడెం: మండలంలోని బుట్టాయిగూడెం వద్ద భూ భారతి అమలులో భాగంగా ఏర్పాటు చేసిన గ్రామ సభలో దరఖాస్తుదారులకు తిప్పలు తప్పడంలేదు. గ్రామసభ వద్ద ఎలాంటి వసతులు ఏర్పాటు చేయకపోవడంతో దరఖాస్తు చేసుకోవడం కోసం వచ్చిన రైతులకు మండుటెండలో ఇబ్బందులు పడ్డారు. కనీసం నీడ, తాగునీరు సౌకర్యం ఏర్పాటు చేయాల్సిన అధికారులు చేతులెత్తేసి ముఖం చాటేశారు. కనీసం ఎండకు ఒక టెంటు, తాగడానికి నీరు ఏర్పాటు చేస్తే బాగుండని పలువురు అభిప్రాయపడ్డారు.

పుట్టిన రోజున మొక్క నాటండి


మొక్కలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

వాజేడు : ప్రతీ ఒక్కరు తమ పుట్టిన రోజున ప్రతీ సంవత్సరం ఒక మొక్కను నాటాలని ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సోయం ఆనందరావు అన్నారు. పాఠశాల ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి 60 మొక్కలు నాటారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ కాలుష్యాన్ని నిర్మూలించాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. స్వచ్ఛమైన గాలితోనే ప్రాణకోటి మనుగడ ఆ ధారపడి ఉందన్నారు. కార్యక్రమంలో స్వరూప్ సింగ్, మల్లయ్య,ఆనంద్, శ్రీకాంత్, కుమార్‌బాబు, ప్రభాకర్, రాజ్యలక్ష్మి, రాజేష్, అమాజీ రాణి పాల్గొన్నారు.

నిరుపయోగంగా కుట్టుమిషన్లు


చిట్యాలలో నిరుపయోగంగా ఉన్న కుట్టుమిషన్లు


జూకల్ రైతు వేదికలో..

- గతంలో ఎన్నికల కోడ్‌తో ఆగిన పంపిణీ
- దుమ్ము పడుతున్నా.. పట్టించుకోని అధికారులు
- ఎదురుచూస్తున్న లబ్ధిదారులు

చిట్యాల: మహిళ సంఘాల సభ్యులకు స్వయం ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో నియోజకవర్గ వ్యాప్తంగా కుట్టమిషన్లు అందించాలని 2023 సంవత్సరంలో అప్పటి జిల్లా అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు నిధులు కేటాయించి కుట్టుమిషన్లు కొనుగోలు చేసి ఆయా మండలాలకు సరాఫరా చేశారు. ఈ మేరకు అర్హులైన మహిళలకు కుట్టు మిషన్లు అందించడానికి జాబితాను సిద్ధం చేయాలని మండల అధికారులను ఆదేశించారు. ఆ తరువాత ఎన్నికల కోడ్ రావడంతో పంపిణీ ప్రక్రియ ఆగిపోయింది. దీంతో అప్పటి నుంచి కుట్టుమిషన్లను మండలంలోని రైతుల వేదికల్లో, మరికొన్ని స్థానిక ఐకేపీ కార్యాలయంలో భద్రపరిచారు. కాగా అవి ఇప్పటి వరకు అక్కడే నిరుపయోగంగానే ఉండి దుమ్ముపడుతున్నాయి. అలాగే మరికొన్ని రోజుల్లో స్థానిక సంస్థల ఎన్నికలు వస్తున్నాయి. దీంతో మరింత జాప్యం జరిగే అవకాశం ఉంది. ఈ క్రమంలో లబ్ధిదారులకు కుట్టుమిషన్లు పంపిణీ ఉన్నట్లా.. లేనట్లా అని వారు ఎదురుచూస్తున్నారు. కావున సంబంధిత అధికారులు రాజకీయ నాయకుల జోక్యం లేకుండా వెంటనే కుట్టుమిషన్లు పంపిణీ ప్రక్రియ ప్రారంభించాలని మహిళ సంఘాల సభ్యులు కోరుతున్నారు. ఈ విషయంపై డీఆర్‌డీఓ బాలకృష్ణను వివరణ అడగగా మండలంలోని రైతు వేదికలలో 250 కుట్టుమిషన్లు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని ఈ విషయం కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పంపిణీ చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు.

సమస్యల పరిష్కారానికే సదస్సులు

- తహసీల్దార్ నాగరాజు


దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్ నాగరాజు

కాటారం: భూ సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భూ భారతి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ నాగరాజు తెలిపారు. మండలంలోని పోతుల్వాయి, రేగులగూడెం, నల్లగుంట గ్రామాల్లో బుధవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. పోతుల్వాయి 284, రేగులగూడెంలో 111, నల్లగుంటలో 17 దరఖాస్తులు స్వీకరించినట్లు తహసీల్దార్ పేర్కొన్నారు. ఈ సదస్సుల్లో నయాబ్ తహసీల్దార్ రామ్మోహన్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా పెద్దమ్మ తల్లి బోనాలు


ఆలయానికి వెళ్తున్న గ్రామస్తులు

చిట్యాల: మండల కేంద్రంలోని చింతలపల్లిలో పెద్దమ్మ తల్లి బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. బోనాలను ఎత్తుకొని డప్పులు సప్పుల్లతో ఊరేగింపుగా తీసుకువెళ్లి పెద్దమ్మ తల్లికి మొక్కులు అప్పగించారు. గ్రామాన్ని చల్లగా చూడాలని, గ్రామస్తులు ఆయురారోగ్యాలతో ఉండేలా దీవించాలని, పంటలు బాగా పండాలని ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాలను సమర్పించారు. ముదిరాజు కులస్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన ఉండాలి


ఎస్‌ఎస్‌తాడ్వాయి : విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి


కన్నాయిగూడెం : హెల్మెట్ పై అవగాహన కల్పిస్తున్న ఎస్సై వెంకటేష్


వెంకటాపురం(ఎం) : హెల్మెట్ వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై రాజు

ఎస్‌ఎస్‌తాడ్వాయి/ఏటూరునాగారం/గోవిందరావుపేట/కన్నాయిగూడెం/వెంకటాపురం(ఎం) : సైబర్ నేరాలపై విద్యార్థినులకు అవగాహన కలిగి ఉండాలని తా డ్వాయి, ఏటూరునాగారం, కన్నాయిగూడెం, వెంకటాపురం(ఎం) ఎస్సై లు శ్రీకాంత్‌రెడ్డి, రాజ్‌కుమార్, అచ్చ కమ లాకర్, వెంకటేశ్, చల్లా రాజు అన్నారు. బుధవారం గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలోని విద్యార్థినులకు పోలీస్‌స్టేషన్‌లో సైబర్ నేరాలు, పోక్సో చట్టం, రోడ్డు భద్రత, మాదక ద్రవ్యాల వినియోగం వలన కలిగే అనార్థాలు, సెల్‌ఫోన్‌ల వినియోగంపై, సోషల్ మీడియా, పోలీసుల విధి నిర్వహణ పని తీరుపై అవగాహన కల్పించారు. కేసుల నమోదు వివరాలను విద్యార్థినులకు ఆయన వివరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తల్లిదండ్రులతోపాటు గ్రామాల్లోని ప్రజలకు సైబర్ మోసాలకు గురి కాకుండా అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థినులు కష్టపడి ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు సాధించాలన్నారు. పోలీస్ స్టేషన్ సందర్శించిన విద్యార్థినులకు జ్ఞాపకంగా కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా విద్యార్థినులందరికీ వాటర్ బాటిళ్లను పంపిణీ చేశారు. అలాగే ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలని అన్నారు. ఏటూరునాగారం మండలంలోని చిన్నబోయినపల్లి, రొయ్యూర్, ముళ్లకట్ట, రాంనగర్, శివాపురం, షాపెల్లి, శంకరాజుపల్లి, చెల్పాక గ్రామాల్లోని వాహనదారులు హెల్మెట్ ధరించి వాహనాలను నడుపాలని ఎస్సై కోరారు. కన్నాయిగూడెం మండలంలో ని పోలీసులు బుట్టాయిగూడెం వద్ద ప్రధాన రహదారిపై వాహన తనిఖీలు చేశారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలను చేర్పించాలి

- ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కావ్య


అమ్మ మాట-అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో పాల్గొన్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కావ్య

ములుగు రూరల్ : అంగన్‌వాడీ కేంద్రాల్లో మూడేళ్లు నిండిన పిల్లలను చేర్పించి నమోదు సంఖ్యను పెంచాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కావ్య అన్నారు. బుధవారం ప్రేమ్‌నగర్‌లో అమ్మ మాట- అంగన్‌వాడీ బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాలలో పూర్వ ప్రాథమిక విద్యను అందిస్తున్నామని అన్నారు. ఆహ్లాదకరంగా, ఆట పాటలతో విద్యను అందిస్తామని అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు నూతనంగా ఎగ్ బిర్యాని ప్రవేశపెట్టిందని అన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ సుగుణ, చిన్నారులు, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల ట్రాక్టర్ పట్టుకున్న అధికారులు

- విచారణ చేసి అప్పగించిన ఏఓ, ఎస్సై

వాజేడు: మండలంలోని చెరుకూరు వద్ద జాతీయ రహదారి పక్కన నిలిపి ఉన్న ఎరువుల ట్రాక్టర్ అనుమానాస్పదంగా కనిపించడంతో వ్యవసాయ, పోలీసు శాఖల అధికారులు మంగళవారం రాత్రి స్వాధీనం చేసుకున్నారు. ఎరువులతో ఉన్న ట్రాక్టర్‌లోని ఎరువుల బస్తాలు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి తరలిస్తున్నారేమో అనే అనుమానంతో ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బుధవారం ఉదయం ఏఓ ముంజ మహేష్, ఎస్సై జక్కుల సతీష్‌లు పూర్తిస్థాయిలో విచారణ నిర్వహించారు. చెరుకూరు గ్రామానికి చెందిన కాటం రాజు అనే రైతు తన వ్యవసాయ అవసరాల కోసం ఏటూర్‌నాగారంలోని గ్రోమోర్ కేంద్రంలో 46 బస్తాల యూరియా, 33 బస్తాల మెగా పవర్ కొనుగోలు చేసినట్లు విచారణలో తేలినట్లు ఏఓ తెలిపారు. తన అవసరాల కోసమే బస్తాలను కొనుగోలు చేసినట్లు తెలియడంతో ఆ బస్తాలను రాజు ఇంటి వద్ద దిగుమతి చేయించి అతనికి అప్పగించారు.

నియామకం


ఎడపల్లిలో నియామకపత్రం ఇస్తున్న నాయకులు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం ఎడపల్లి, సూరారం గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ గ్రామశాఖను ఏకగ్రీవంగా మండల అధ్యక్షుడు బెల్లంపల్లి సురేష్ మాదిగ ఆధ్వర్యంలో బుధవారం నియమించారు. ఎడపల్లి గ్రామ అధ్యక్షుడిగా చేకుర్తి శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా చేకుర్తి రాజ లింగయ్య, కార్యదర్శిగా చేకూర్తి రాజబాబు, ప్రధాన కార్యదర్శిగా చేకుర్తి రాజయ్య, కోశాధికారిగా ఆయిల్ల మహేష్, సూరారం గ్రామ శాఖ అధ్యక్షుడిగా ఆయిల్ల అశోక్, ప్రధాన కార్యదర్శిగా మండపల్లి విష్ణు, కార్యదర్శిగా మీసాల సాంబం, కోశాధికారిగా జిల్లెల అజయ్, ప్రచార కార్యదర్శిగా జిల్లేల రాజులను ఎన్నుకున్నారు. ఈ మేరకు వారికి నియామక పత్రాలు అందజేశారు. సీనియర్ నాయకులు ఆయిల సమ్మయ్య, తుడిచర్ల దుర్గయ్య, జిల్లెల్ల నాగరాజు, చింతకుంట్ల రాము, చింతకుంట సదానందం, చేకుర్తి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కమిటీ ఎన్నిక


ఎన్నికైన మండల కమిటీ సభ్యులు

చిట్యాల: ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ అండ్ సీడ్స్ నూతన మండల కమిటీని బుధవారం మండల కేంద్రంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గుమ్మడి సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా సర్వ రాజు, ప్రధాన కార్యదర్శిగా పువ్వాటి హరికృష్ణ, సహాయ కార్యదర్శిగా కైరిక కిషన్ రావు, కోశాధికారి జిన్నె వేణు, కార్యవర్గ సభ్యులుగా మేకల శ్రీనివాస్, గంజి రవీందర్, జోగు భాను చందర్, మారేళ్ల దేవేందర్‌రెడ్డి, గుండెబోయిన మహేందర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

డీఈఓపై చర్య తీసుకోవాలి

భూపాలపల్లి అర్బన్: ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో మామూళ్లు వసూళ్లు చేస్తున్న జిల్లా విద్యాశాఖ అధికారిని సస్పెన్షన్ చేయాలని ప్రోగ్రెసివ్ స్టూడెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షుడు వినయ్ బుధవారం ఒక ప్రకటనలో ఉన్నాతాధికారులను డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో ఓ ప్రైవేట్ పాఠశాలలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై మూడు రోజుల క్రితం ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఫిర్యాదుపై విచారణ చేపట్టకుండా దీనికి వ్యతిరేకంగా సంబంధిత పాఠశాల చైర్మన్‌తో కుమ్మక్కై తన పేరును చైర్మన్‌కు తెలిపినట్లు పేర్కొన్నారు. దీంతో సంబంధిత యాజమాన్యం తనను బెదిరింపులకు పాల్పడుతుందని ఆరోపించారు. యాజమాన్యం నుంచి లక్షలాది రూపాయాలు లంచం తీసుకొని పాఠశాలను తనిఖీ చేయడం లేదని ఆరోపించారు. కలెక్టర్ స్పందించి విచారణ చేపట్టి డీఈఓపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రైతులకు 'భరోసా'

కాటారం: ప్రభుత్వం ద్వారా అందిస్తున్న రైతు భరోసా మండలంలోని రైతులకు అందుతున్నట్లు మండల వ్యవసాయశాఖ అధికారిని పూర్ణిమ తెలిపారు. ఇప్పటి వరకు మండలంలో 8566 మంది రైతులకు సంబంధించి రూ.6,92,73,053 ఖాతాల్లో జమ అయినట్లు పేర్కొన్నారు. మిగిలిన రైతులకు సైతం రైతు భరోసా డబ్బులు జమ అవుతాయని ఆందోళన చెందవద్దని ఏఓ తెలిపారు.

స్నేహితుడి కుటుంబానికి చేయూత


ఆర్థిక సాయం అందజేస్తున్న స్నేహితులు

మొగుళ్లపల్లి: మండలంలోని కొర్కిశాలకు చెందిన ఇప్పకాల రాజేందర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో మృతుడి కుమార్ శ్రీనుతో కలిసి 2007–08 పదో తరగతి చదువుకున్న బాల్య స్నేహితులు బాధిత కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో బండారి ఓదెలు, తిప్పారపు సురేందర్, ల్యాండిగా రాజేందర్, జునుమల తిరుపతి, నాగలగని రాజేందర్, పోతుగంటి దశరథం తదితరులు పాల్గొన్నారు.

దేశంలో కులగణన చేపట్టాలి

- బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్రాములు


మాట్లాడుతున్న వెంకట్రాములు

భూపాలపల్లి రూరల్: దేశంలో 2025 సంవత్సరంలోనే కులగణన చేపట్టాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు డిమాండ్ చేవారు బుధవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వెంకట్రాములు మాట్లాడారు. బీసీ సంఘాలు నిర్వహించిన పోరాటాల ఫలితంగానే కేంద్ర ప్రభుత్వం జనగణనలో కులగణనకు ఆమోదించి గెజిట్ ప్రకటన చేసిందన్నారు. 2021లో జరగాల్సిన జనగణన కుంటి సాకులతో వాయిదా వేసిన కేంద్ర ప్రభుత్వం 2027లో నిర్వహిస్తామని చెప్పడం బీసీలను మోసం చేయడమే అన్నారు. 2025లోనే జనగణన పూర్తి చేసి బీసీలపై చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. చట్టసభలలో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని, మహిళా రిజర్వేషన్‌లో బీసీ కోటా నిర్ణయించాలన్నారు. జనాభా ప్రాతిపదికన నిధులు కేటాయించి బీసీల అభివృద్ధికి సంక్షేమానికి ఖర్చు పెట్టాలని అన్నారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు పెంచి ఎన్నికలు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో భీమనాదుని సత్యనారాయణ, చింతకింది కుమారస్వామి, పనస ప్రసాద్, సీపీఐ పట్టణ కార్యదర్శి సోత్కు ప్రవీణ్ కుమార్, వేముల శ్రీకాంత్, క్యాతరాజు సతీష్, మెరుగు రమేశ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ


పుస్తకాలు అందజేస్తున్న ఉపాధ్యాయులు

కాటారం: మండలంలోని మద్దులపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వంసరఫరా చేసిన పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్కులను బుధవారం ప్రధానోపాధ్యాయుడు ఆజ్మీర గోపి నాయక్ పంపిణీ చేశారు. విద్యార్థులు పట్టుదలతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రేపాల వేణుగోపాల్, పంచాయితీ కార్యదర్శి రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా స్థాయి క్రీడా పోటీలకు విద్యార్థుల ఎంపిక


చిట్యాల: మాట్లాడుతున్న రఘుపతి


గణపురం: క్రీడలు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

గణపురం: క్రీడా పాఠశాలల్లో 4వ తరగతిలో ప్రవేశాల కోసం మండలంలో బుధవారం నిర్వహించిన మండల స్థాయి పోటీల్లో పలువురు విద్యార్థులు పాల్గొనగా 10 మంది జిల్లా స్థాయికి ఎంపికైనట్లు మండల విద్యాశాఖ అధికారి ఊరుగొండ ఉప్పలయ్య తెలిపారు. వారు ఈ నెల 23న జిల్లా స్థాయిలో నిర్వహించే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీహెచ్‌ఎస్ ప్రధానోపాధ్యాయుడు దేసు సతీష్ ,వ్యాయమ ఉపాధ్యాయులు కోసరి సరిత, సాంబరాజు, గఫూర్, మమత పాల్గొన్నారు.

చిట్యాలలో

చిట్యాల: మండల కేంద్రంలోని పీఏసీఎస్ ఆవరణంలో నిర్వహించిన పోటీల్లో 20 మంది జిల్లా స్థాయికి ఎంపికైనట్లు ఉన్నత పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు శ్రీరాం రఘుపతి తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ స్కూల్ ఎంపిక కో–ఆర్డినేటర్ సూదం సాంబమూర్తి, ఫిజికల్ డైరెక్టర్లు బండి ప్రసాద్, నూకల లింగయ్య, స్వరూప రాణి, ఉమా, గాజర్ల శ్రీనివాస్, సంఘ రఘుపతి, ఉపాధ్యాయులు సదయ్య, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

నేడు క్రీడా పాఠశాలల ప్రవేశాలకు ఎంపిక పోటీలు

టేకుమట్ల: తెలంగాణ క్రీడా పాఠశాలల్లో 2025–26 సంవత్సరానికి సంబంధించి 4వ తరగతిలో ప్రవేశం కోసం నేటి(గురువారం)మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో స్థాయి ఎంపిక క్రీడలు నిర్వహిస్తున్నట్లు మండల విద్యాధికారి చిదిరాల సుధాకర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ప్రాథమిక స్థాయిలో చదువుతున్న బాల బాలికలు అర్హులని క్రీడల్లో నైపుణ్యత చాటిన విద్యార్థులను ఎంపిక చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. నాలుగో తరగతి చదవడంతో పాటు 31 ఆగస్టు 2016 నుంచి సెప్టెంబర్ 1, 2017 సంవత్సరంలో జన్మించిన విద్యార్థులు పోటీల్లో పాల్గొనేందుకు అర్హులని చెప్పారు. విద్యార్థులు వారి వెంట ఆధార్‌కార్డు, స్టడి సర్టిఫికెట్ తీసుకోని క్రీడలకు హాజరు కావాలని సూచించారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 95022 68022 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే యువకుల మృతి

- మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు


పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు

కాళేశ్వరం: ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే ఆరుగురు యువకులు గోదావరిలో మునిగి ప్రాణాలు కోల్పోయారని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు అన్నారు. మేడిగడ్డ వద్ద నీటిలో ఈనెల 7న మునిగి మృతి చెందిన బాధిత కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒకవైపు బరాజ్‌లో యువకుల ఆచూకీ కోసం గాలింపు చేపట్టితే హైదరాబాద్‌లో అందాల పోటీల్లో మంథని ఎమ్మెల్యే పాల్గొన్నారని ఎద్దేవా చేశారు. మంత్రి రెండు రోజుల తర్వాత యువకుల ఇళ్లకు వచ్చి పరామర్శించి రూ.లక్ష ఎక్స్‌గ్రేషియా ఇప్పిస్తామని చెప్పి వెళ్లాడని, కానీ ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం అందలేదన్నారు. మృతి చెందిన ఆరుగురు విద్యార్థుల కుటుంబాలకు సర్కారు ఇచ్చే రూ.లక్ష ఎక్స్‌గ్రేషియాను తిరస్కరించాలని అన్నారు. ఆయన వెంట పార్టీ నాయకులు శ్రీనివాసరావు, అలీంఖాన్ తదితరులు పాల్గొన్నారు.

మేకులు కొట్టి.. బ్యానర్లు కట్టి!

- చెట్లను ప్రచార సాధనాలుగా వాడుతున్న కంపెనీలు
- పట్టించుకోని అధికారులు


చెట్టుకు మేకులు కొట్టి ఏర్పాటు చేసిన షీటు

రేగొండ: మండలంలో పలు ప్రైవేట్ కంపెనీలు, షాపుల నిర్వాహకులు, స్కూల్ యాజమాన్యాలు రోడ్డు పక్కన ఉన్న చెట్లను ప్రచార సాధనాలుగా వాడుకుంటున్నారు. వీటికి ఫ్లెక్సీలు, బ్యానర్లను ఏర్పాటు చేస్తున్నారు. ఫైబర్, ప్లాస్టిక్, ఐరన్‌తో తయారు చేసిన షీట్లను కొడుతున్నారు. ఇందుకోసం మేకులు వినియోగిస్తున్నారు. దీంతో మొక్కలు, వృక్షాలు ఎండిపోతున్నాయని పర్యావరణ ప్రేమికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెట్లకు కొట్టిన మేకుల కారణంగా వాటికి పుండ్ల వంటి గాయాలు ఏర్పడి ఈదురు గాలులకు విరిగిపోతున్నాయని పేర్కొంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి బ్యానర్లు, పోస్టర్లు కట్టిన, అతికించిన ఆయా కంపెనీలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.